
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com



మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.4 : కనిష్ఠం 19.6

కామారెడ్డి

జిల్లా వార్తలు

5

బుధవారం 11 డిసెంబరు 2024



కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వరకు సర్వేకే పరిమితమైన కేకేవై రోడ్డు

కేకేవైకి మోక్షం కలిగేనా?

- ఎమ్మెల్యే చొరవతోనైనా పనులు ముందడుగు పడేనా?
- జాతీయ రహదారి పనులపై దృష్టి సారించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- ఇటీవల రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డికి విన్నవించిన ఎమ్మెల్యే
- వెంటనే కేంద్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రితో సంప్రదించిన రాష్ట్ర మంత్రి
- కరీంనగర్-కామారెడ్డి-ఎల్లారెడ్డి జాతీయ రహదారిగా ప్రకటించి ఆరేళ్లు
- జాతీయ రహదారి పనులకు కేంద్రం నిధులు కేటాయిస్తేనే ముందడుగు

కామారెడ్డి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కామారెడ్డి-ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలో గత ఆరేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం కేకేవై జాతీయ రహదారి మంజూరు చేసింది. అయితే ఈ జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రకటనకు మాత్రమే పరిమితం అయింది. మాచారెడ్డి నుంచి మొదలుకొని కామారెడ్డి వరకు ఉన్న ఈ రహదారి వెంట ప్రమాదకరంగా మూలమలుపులు ఉండడం, తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుండడంతో అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కరీంనగర్-కామారెడ్డి-ఎల్లారెడ్డి జాతీయ రహదారి పనులపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ జాతీయ రహదారి పనులను వెంటనే చేపట్టాలని ఇటీవల ఎమ్మెల్యే రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిశారు. కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరితో మాట్లాడి కేకేవై జాతీయ రహదారికి కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సైతం సానుకూలంగా ఉందని రాష్ట్ర మంత్రి కోరినట్లు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ జాతీయ రహదారి పనులకు ఇప్పుడైన ముందడుగు పడుతుందా లేదా చూడాలి.

160 కి.మీ వరకు కేకేవై జాతీయ రహదారి

కరీంనగర్-సిరిసిల్ల-కామారెడ్డి-ఎల్లారెడ్డి(కేకేవై) రోడ్డును జాతీయ రహదారిగా కేంద్ర ప్రభుత్వం గుర్తించి ఆరేళ్లు గడిచింది. కరీంనగర్ నుంచి ప్రారంభమయ్యే ఈ రహదారి జిల్లాలోని పిట్లం వరకు 160 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ మార్గాన్ని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేసి ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని భావించారు. రోడ్డు, రవాణా సౌకర్యాలు మెరుగుపడితే వ్యాపారవృద్ధికి ఆస్కారం ఉంటుంది. కామారెడ్డి నుంచి సిరిసిల్లా మీదుగా కరీంనగర్ వరకు నిత్యం 20వేలకు పైగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కామారెడ్డి - సిరిసిల్ల - కరీంనగర్ - జగిత్యాల - సిద్దిపేట, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్ తదితర జిల్లాలకు ఈ రహదారి మీదుగానే ప్రయణిస్తున్నారు. అలాగే పొరుగు రాష్ట్రాలకు వెళ్లే వారు కూడా ఈ రోడ్డు మీదుగానే వెళ్తారు. ఈ మార్గంలో రోజు వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇటీవల కాలంలో వాహనాల రద్దీ మరింత పెరిగింది. రెండు వరుసల రోడ్డు కావడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. అక్కడక్కడ మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏదో ఒక్క చోట ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. నాలుగు వరుసలుగా అభివృద్ధి చేస్తే రవాణా కష్టాలు తీరడంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అంతా ఆశించారు. కానీ ఇప్పటి వరకు కేకేవై హైవేకు సర్వేతోనే సరిపెట్టారు.

కేకేవైకి నిధులు కేటాయించని కేంద్రం

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల మీదుగా జాతీయ రహదారుల విస్తీర్ణానికి కేంద్ర ప్రభుత్వం గతంలోనే రెండు హైవేలను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో హెచ్ఎంబీ జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వం గత మూడేళ్ల కిందట గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగా కేకేవై హైవేకు మొండిచేయి చూపింది. గత ఆరేళ్లుగా జిల్లా మీదుగా వెళ్లే కేకేవై, హెచ్ఎంబీ జాతీయ రహదారి నిర్మాణ పనులు సర్వేకే పరిమితం కాగా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పనులు మాత్రం ముందుకు సాగలేదు. అయితే ఎట్టకేలకు హెచ్ఎంబీ (మెదక్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బోధన్, బైంసా) వరకు నిర్మించనున్న 168 కిలో మీటర్ల జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఆమోదం తెలిపింది. ఈ జాతీయ రహదారితో పాటు మరో జాతీయ రహదారి అయిన మెదక్, ఎల్కతుర్‌ల మధ్య 133 కిలోమీటర్ల మేరకు చేపట్టే హైవే పనులకు కేంద్రం గెజిట్ గతంలోనే విడుదల చేసింది. ప్రమాదాలకు నెలవుగా మారిన కేకేవై జాతీయ రహదారికి ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

66 కి.మీ.లు.. 18 మూల మలుపులు

జాతీయ రహదారిగా మంజూరైన కేకేవై కామారెడ్డి జిల్లాలో మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ శివారు నుంచి మొదలుకొని ఎల్లారెడ్డి పట్టణం వరకు సుమారు 66 కి.మీ మేరకు విస్తరించి ఉంది. ప్రస్తుతం ఈ రహదారి రాష్ట్రీయ రహదారుల పరిధిలో ఉండగా ఎస్‌హెచ్- 11గా కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం ఈ రహదారి వంద ఫీట్లలో రోడ్డు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 23 ఫీట్లలోనే బీటీ రోడ్డు రెండు లైన్లతో వేసి ఉంది. మిగితా 9 ఫీట్లు ఇరువైపుల మట్టితో ఉంది. కానీ ఈ రహదారి రెండు లైన్లతో ఇరువైపులా 50 ఫీట్ల బీటీ రోడ్డు ఉండాలి. కానీ ఏళ్ల తరబడి 23 ఫీట్ల రోడ్డుకే పరిమితమవుతూ వచ్చింది. ఈ రహదారి అభివృద్ధి చేయకపోవడంతో ప్రమాదాలకు నెలవుగా ఎస్‌హెచ్-11 మారుతోంది. కామారెడ్డి డివిజన్ పరిధిలోనే మాచారెడ్డి ఘన్‌పూర్ శివారు నుంచి మొదలవుతుంది. మాచారెడ్డి మండలంలోని పలు గ్రామాలతో పాటు కామారెడ్డి మండలం, పట్టణం మీదుగా దేవునిపల్లి, తాడ్వాయి, లింగంపేట్, ఎల్లారెడ్డి పట్టణం వరకు 66 కి.మీ.లు ఉంది. ఈ రహదారి వెంట సుమారు 18 వరకు ప్రమాదకరమైన మూల మలుపులు ఉన్నాయి. గతంలోనే రహదారి నిర్మాణం చేపట్టినప్పుడు సరైన ప్రణాళిక లేకుండా వంకర టింకరగా రోడ్డు నిర్మాణం చేపట్టడంతోనే ఈ మూల మలుపులు ఏర్పడ్డాయనే వాదన స్థానిక గ్రామప్రజల నుంచి వినిపిస్తోంది. కనీసం రోడ్డు వెడల్పు కూడా చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.



కామారెడ్డిలో సమ్మెలో పాల్గొన్న సమగ్రశిక్ష ఉద్యోగులు

సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

మద్నూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సమ్మె కార్యక్రమానికి ఉమ్మడి మద్నూర్ మండలం నుంచి సర్వ శిక్ష అభియాన్ సమగ్ర శిక్ష ఉద్యోగులు తరలి వెళ్లారు. విద్యాశాఖలో కీలక పాత్రను పోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. మంగళవారం తమ విధులను బహిష్కరించి కామారెడ్డిలో నిర్వహిస్తున్న సమ్మె కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలోని విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడనున్నది అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేయగా పీసీసీ అధ్యక్షుడు హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులరైజ్ చేస్తామని మీ డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులు పలుమార్లు ఆందోళనలు చేస్తున్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని లేకపోతే విధులను బహిష్కరిస్తామని అధికారులకు అందజేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరవధిక సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష సిబ్బందికి వేతనాలు అరకొరగానే ఉన్నాయి. 2006లో రాజీవ్ విద్యా మిషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థల్లో కలెక్టర్లు చైర్మన్లుగా ఉన్న త్రీ మెన్ కమిటీ ద్వారా రోస్టర్ మెరిట్ ఆఫ్ రిజర్వేషన్ పద్ధతిలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఒప్పంద ఉద్యోగులుగా వీరిని ఎంపిక చేశారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో 34మంది పని చేస్తున్నారు. పాఠశాలలకు సంబంధించిన అన్ని రకాల రిపోర్టులను తయారు చేసి ఎంఈవోలకు అందించడం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ చర్యలు చేపట్టడం వంటి కీలకమైన బాధ్యతలను నిర్వహిస్తున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను వాయిదా వేశారు. మధ్యాహ్న భోజనం అందించడంలో వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. వీరి సమ్మెతో మధ్యాహ్న భోజనం అమలు కూడా కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. గత సెప్టెంబరులో 25 రోజుల పాటు రిలే నిరసనలు చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈసారి నిరవధిక సమ్మెకు వెళ్లడంతో పాఠశాల విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు.

కామారెడ్డి టౌన్: సమస్యలు నెరవేర్చే వరకు నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు సమగ్రశిక్ష ఉద్యోగులు ప్రకటించారు. గత మూడు రోజుల పాటు నిరసన దీక్షలు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మంగళవారం కామారెడ్డి మున్సిపల్ వద్ద సమ్మెను కొనసాగించారు. ఈ సమ్మెకు పీఆర్‌టీయూ తెలంగాణ అధ్యక్షుడు అంబీర్ మనోహర్ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, శ్రీధర్‌కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌రెడ్డి, నాయకులు శ్రీను, రాములు, శ్రీవాణి పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సీఎం కప్ 2024 టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికి వస్తుందని గెలుపు ఓటములు సహజమని అన్నారు. మొదటిరోజు ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అర్బన్ రూరల్ ఖోఖో, వాలీబాల్ పోటీల్లో సాంఘిక సంక్షేమ, గురుకుల పాఠశాల విజేతలుగా నిలిచారు. మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు రన్నర్ విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో ఖోఖో, వాలీబాల్ పోటీల్లో గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. రూరల్ పరిధిలోని క్రీడా పోటీల్లో ఖోఖో లో మాచాపూర్ విద్యార్థులు విజేతలుగా, అన్నాసాగర్ విద్యార్థులు రన్నర్‌గా నిలిచినట్లు మండల విద్యాధికారి వెంకటేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి : కలెక్టర్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. నివారణ చర్యలు చేపట్టిన వివరాలతో పాటు ఫొటోలను సమర్పించాలని సూచించారు. ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర రహదారులపై తరచూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తించి శాఖల సమన్వయంతో నివారణ చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన చోట్ల విద్యుత్ దీపాలు, సూచికలు వంటివి ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా అనధికారికంగా ఏర్పాటు చేసిన రవాణాకు ఇబ్బంది కలిగే టీ, టిఫిన్ సెంటర్‌లను తొలగించాలని తెలిపారు. గత సమావేశంలో చర్చించిన, చేపట్టాల్సిన పనులను ఆయా శాఖల అధికారులు పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ ప్రమాదాలను అరికట్టాలని అందుకు కావాల్సిన చేయాల్సిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ సీఎస్ రావు, రోడ్లు భవనాలశాఖ ఈఈ రవిశంకర్, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

గ్రూప్-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీతో కలిసి వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-2 పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్షిస్తు జిల్లాలో 19 కేంద్రాల్లో 8,085 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. ఆయా సెంటర్లలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ కోసం సిబ్బందిని నియమించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష జరిగే రోజుల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్పీ సింధూశర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, రీజినల్ కో ఆర్డినేటర్ విజయ్‌కుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలి

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై ఏవైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 12లోపు తెలియజేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను రూపొందించడం జరిగిందన్నారు. ఇప్పటికే ఈనెల 7న జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీల్లో ముసాయిదా జాబితాను ప్రకటించామని గుర్తు చేశారు. జిల్లాలో మొత్తం 535 గ్రామ పంచాయతీలు, 4,686 వార్డులు ఉండగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ 4,697 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తు ముసాయిదాను రూపొందించామని తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 12లోపు తెలుపవచ్చని, 12న ఎంపీడీవోలు నిర్వహించే సమావేశంలోనూ అభ్యంతరాలు స్వీకరిస్తారని 13న పరిష్కరించి 17న అన్ని మండలాలు, గ్రామ పంచాయతీల్లో తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటించబడుతుందని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా ప్రకారం జుక్కల్ నియోజకవర్గంలో 14043, ఎల్లారెడ్డిలో 14,319, కామారెడ్డిలో 23,352 మంది ఉన్నారని 6 జనవరి 2025న ఫైనల్ పబ్లికేషన్ ప్రచురిస్తామని తెలిపారు.

రైతు కల్లాల దారికి అడ్డంగా కందకాలు తవ్విన అటవీశాఖ అధికారులు



ముస్తాపూర్ వద్ద కందకాలు తవ్విన అటవీ శాఖ అధికారులు

లింగంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్తాపూర్‌లో రైతుల ధాన్యం విక్రయ కేంద్రం వద్దకు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు దారికి అడ్డంగా కందకాలు తవ్వడంతో రైతులు అటవీ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు. గత నాలుగు సంవత్సరాలుగా రైతులు ధాన్యం విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడ బాగు చేసుకుని ఖరీఫ్, రబీ పంటలను అక్కడ విక్రయిస్తున్నారు. మంగళవారం అటవీశాఖ అధికారులు కల్లానికి వెళ్లే దారికి అడ్డంగా కందకాలు గుంతలు తవ్వడంతో రైతులు వచ్చే రబీలో కల్లానికి ఎలా వెళ్లాలని అటవీ శాఖ అధికారలను ప్రశ్నించారు. దాంతో అటవీశాఖ అధికారులు పొంతన లేని సమాధానాలు ఇస్తున్నారని అటవీశాఖ అధికారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారని వెంటనే కాలువను మూసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారిన అన్నారం తండా బ్రిడ్జి

- నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులుపడుతున్న వాహనదారులు



పనులు మధ్యలోనే ఆగిపోవడంతో ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి

రాజంపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం తండా బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. నూతన బ్రిడ్జి పనులు మధ్యలోనే ఆగిపోవడంతో వాహనదారులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో వర్షాకాలంలో వాగు ఉధృతంగా పారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించి బ్రిడ్జి పనులు ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో పనులు సైతం మధ్యలోనే ఆగిపోయాయి. బ్రిడ్జిపైన పలుచోట్ల గుంతలు పడడంతో రాత్రివేళ ప్రయాణించే వారికి ఏ ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన చెందాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కనీసం సూచిక బోర్డులు సైతం లేవని దీంతో పలుమార్లు వాహనాలు బ్రిడ్జి కిందకు వెళ్లి వాహనదారులకు గాయాలు సైతం అయిన సందర్భాలు ఉన్నాయి. సంవత్సరం గడుస్తున్నా అధికారులు, పాలకులు అటువైపు చూడడం లేదని వాపోతున్నారు. భారి వాహనాలు వెళ్లడంతో ఏర్పడిన గుంతలతో మరిన్ని ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పైగా బ్రిడ్జికి ఇరువైపులా వాగు బావి ఉండడంతో అనుకోని సంఘటన ఏదైన జరిగితే ప్రాణాల మీదకు వచ్చే అవకాశాలు లేకపోలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. రాజంపేట మీదుగా ఆర్గొండ, తాడ్వాయి మండలానికి ప్రధాన రహదారి కావడంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దోమకొండలో రిజిష్టర్లను తనిఖీ చేస్తున్న ఏడీఏ అపర్ణ

ప్రతీ వస్తువును రిజిష్టర్‌లో నమోదు చేయాలి

దోమకొండ డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులు తమ దుకాణంలో ఉన్నటువంటి ప్రతీ వస్తువు యొక్క వివరాలను స్టాక్ రిజిష్టర్‌లో ఎప్పటికపుడు నమోదు చేయాలని ఏడీఏ అపర్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్నటువంటి వివిధ కంపెనీలకు సంబంధించిన మందుల యొక్క ఇన్వాయిస్, తేదీలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన వస్తువులకు తెల్ల పేపర్‌లో కాకుండా తప్పకుండా సంబంధిత దుకాణం పేరుపై ఉన్న బిల్లులో రైతు కొనుగోలు చేసినటు వసువు యొక్క వాటిని ధర, కంపెని పేరు రాసి రైతు సంతకంతో పాటు దుకాణందారు సంతకం చేసి ఉండాలని ఆదేశించారు. ఎవరైన నిబంధలు పాటించకుంటే అట్టి దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రైతులకు నాసిరకం మందులు అమ్మితే(లైసెన్స్ లేకుండా ఉన్నటువంటి)కఠిన చర్యలు తప్పవన్నారు. అమె వెంట దోమకొండ మండల వ్యవసాయాధికారిణి మణి దీపిక, ఏఈవోలు క్రిష్ణారెడ్డి, మాన్యూష, ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులు బాల్‌రాజు, రవి, శ్రీకాంత్ ఉన్నారు.



సంపత్‌గౌడ్‌కు కండువా వేసి స్వాగతిస్తున్న కవిత

జాగృతిలో చేరిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

లింగంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలానికి చెందిన మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ ఎదురుగట్ల సంపత్‌గౌడ్ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జాగృతిలో చేరారు. ఈ సందర్భంగా సంపత్‌గౌడ్‌కు కవిత కండువా కప్పి జాగృతి సంస్థలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ ఆశయాలకు, లక్ష్యాలకు అంకితమై పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ రాష్ట్ర చైర్మన్ ఆయాచితం శ్రీధర్, తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్, నవీన్ ఆచారి, నరెందర్ యాదవ్‌లు ఉన్నారు.

83 ఫీట్ల రోడ్డు పనుల కోసం మార్కింగ్



రోడ్డు పనుల కోసం కొలతలు చేపడుతున్న మున్సిపల్ అధికారులు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సబ్‌స్టేషన్ నుంచి లింగాపూర్ శివారులోని బృందావన్ గార్డెన్ వరకు 83 ఫీట్ల రోడ్డు పనుల కోసం మంగళవారం మున్సిపల్ అధికారులు మార్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య కొంత వరకైనా తగ్గించాలనే ఉద్దేశ్యంతో దేవునిపల్లి, లింగాపూర్ శివారులో భూములు ఉన్న ప్రజలు రోడ్డు వేసేందుకు కావాల్సిన భూమిని మున్సిపల్‌కు గిఫ్ట్ డీడ్ చేయడానికి ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. గతంలో తాను చేసిన విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు లేఖలు సైతం అందించారని తెలిపారు. ప్రస్తుతం ఆ రోడ్డు పనులు ముందుకు సాగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారని అన్నారు. నిజామాబాద్ వైపు నుంచి దేవునిపల్లి వైపు వెళ్లే వాహనాలు పట్టణంలోకి రాకుండా ఉంటాయని దీంతో గమ్యస్థానం తగ్గడంతో పాటు ట్రాఫిక్ కూడా కొద్దిమేర తగ్గుతుందని అందుకు సహకరించిన యజమానులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

మళ్లీ తెరపైకి కేంద్రీయ విద్యాలయం

మద్నూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మద్నూర్ మండలంలో 2018లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేస్తామని అప్పట్లో అధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి, కానీ ఇంతవరకు కొలిక్కి రాకపోగా ప్రజలు సైతం మర్చిపోయారు. ఇటీవల జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఉత్తర్వులను జారీ చేయడంతో మరుగున పడ్డ కేంద్రీయ విద్యాలయం మళ్లీ మద్నూర్‌కు వస్తుందా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇటీవల విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేస్తూ మద్నూర్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయడానికి తాత్కాలిక భవనము లేదా ప్రభుత్వ భవనము ఉన్నట్లయితే ప్రతిపాదనలు పంపిస్తానని ఉత్తర్వులు వెలువరించారు. దానికి సంబంధించిన ఉత్తర్వుల కాపీని ఇటీవల వాట్సప్‌లో రావడంతో ప్రజలు కేంద్రీయ విద్యాలయం మళ్లీ ఏర్పాటు కానున్నదని ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రంలోని 499/2/1 సర్వే నెంబరులో 10.009 ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని ఉత్తర్వులో పేర్కొన్నారు. నూతన భవనం నిర్మించేంత వరకు తాత్కాలికంగా 15 గదులు ఉన్న భవనాన్ని పరిశీలించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు.

అంకాపూర్‌ను సందర్శించిన ఎల్లారెడ్డి డివిజన్ డీలర్లు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి డివిజన్ దేశీప్రాగ్రాం డీలర్లు

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని మంగళవారం ఎల్లారెడ్డి డివిజన్ దేశీప్రాగ్రాం డీలర్లు సందర్శించారు. దేశీశిక్షణ కార్యక్రమంలో భాగంగా పంట పరిశీలనకు వచ్చారు. అంకాపూర్‌లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్నపసుపు, కూర గాయల పంటలను పరిశీలించారు. అనంతరం గుడిరెడ్డి సంఘ భవనంలో గ్రామ స్థులతో సమావేశమై పంటల సాగులో ఇక్కడి రైతులు అవలంభిస్తున్న పద్ధతులు, దిగుబడులు, మార్కెట్ సౌక ర్యంతో పాటు అంకాపూర్ గ్రామాభివృద్ధి గురించి అడిగితెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సమన్వయకర్త నర్సింహచారి,డీటీఎం నవీన్‌కుమార్, గుడిరెడ్డి సంఘం ప్రతినిధి కెకె.బాజన్న, చిన్న అనంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిలబస్ పూర్తిచేసి రివిజన్ చేయాలి

● డీఐఈవో రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఈవో రవికుమార్

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సిలబస్ పూర్తి చేసి వెంటనే రివిజన్ ప్రారంభించాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రవికుమార్ ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. మంగళవారం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ కార్యాలయంలో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. సిలబస్‌ను పూర్తిచేసి రివిజన్ చేయాలని సైన్స్ విద్యార్థులను ప్రయోగశాలలో తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. 90 రోజుల ప్రణాళికను ఖచ్చితంగా అధ్యాపకులు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాల లాగిన్‌లలో విద్యార్థుల సమాచారం, మార్పులు చేర్పులు చేసేందుకు మరో అవకాశం ఉందని అవసరమైన విద్యార్థుల సమాచారాన్ని వెంటనే సరిదిద్దాలన్నారు. కళాశాలల్లో ప్రణాళికబద్ధంగా పనిచేయడంతో పాటు ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధ్యాపకులంతా కృషి చేయాలన్నారు.

డిప్యూటీ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

సుభాష్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ మున్సిపల్ కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న డిప్యూటీ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులను నిత్యం వేధింపులకు గురిచేస్తున్న డిప్యూటీ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సి ఉండగా ఎక్కడా అమలు కావడం లేదన్నారు. గత ప్రభుత్వంతో పాటు ఈ ప్రభు త్వం కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ మిన హాయించి రూ.14,525 మాత్రమే వేతనంగా చెల్లిస్తున్నారని అన్నారు. చలి, వర్షంలో తడుస్తూ తెల్లవారి నుండే పనులు చేస్తున్న మున్సిపల్ కార్మికుల సేవలను అభినందించాల్సిందిపోయి అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. వెంటనే ఆయనపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, యూనియన్ నాయకులు గంగా శంకర్, రాహుల్, మురళి, శ్రీశైలం, విశ్వనాథ్, డ్రైవర్స్ యూనియన్ నాయకులు నవీన్, ఎల్లయ్య, అబ్దుల్లా, లక్ష్మణ్, వినోద్, ఆశాబాయి, మోహన్‌గౌడ్, మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి ఒకరి ఆత్మహత్య

నవీపేట, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌కు చెందిన కొండ సంతోష్‌గౌడ్(40)అనే వ్యక్తి యంచ గోదావరిలో దూకి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. గ్రామంలో కల్లు దుకాణం నడుపుకునే సంతోష్‌గౌడ్ మరో మహిళతో వివాహేతర సంబంధం ఉండడంతో మనస్థాపం చెందిన సంతోష్ గౌడ్ మంగళవారం ఉదయం బైక్‌పై గోదావరి నది వద్దకు వెళ్లి అందులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. అంతకు ముందే తన స్నేహితుడికి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని తెలుపడంతో అతనిని మరో వాహనంలో వెంబడించినప్పటికీ అప్పటికే గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ పేర్కొన్నారు. ఆరు మాసాల క్రితం సంతోష్ గౌడ్ ఇదే విధంగా గోదావరిలో దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడగా స్థానికులు అడ్డుకున్నారని ఆయన వివరించారు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం ఎస్ఐ సందీప్ పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. మైనింగ్ అధికారులకు సిఫారసు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

'బాపూజీ వచనాలయ పరిరక్షణ కోసం మరో ఉద్యమం'

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం 1961లో ఏర్పాటైన బాపూజీ వచనాలయ పరి రక్షణ కోసం మరో ఉద్యమం చేస్తామని కోనేరు సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తాను ఇటీవల జరిగిన బాపూజీ వచనాలయ ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థిగా నామినేషన్ వేసినప్పటికీ కుట్రపూరితంగా తిరస్కరించారని ఆయన తెలిపారు. నగరంలో ఎంతో మంది పేద విద్యా ర్థులకు ఉన్నత చదువుల కోసం ఉపయోగపడుతున్న బాపూజీ వచనా లయం గత పాలకవర్గంలో ముస్తేదారులు ప్రవేశించి ప్రస్తుతం ఉన్న లైబ్రెరీ భవనాన్ని కూలగొట్టి వెనకభాగంలో నూతన భవనాన్ని కట్టి ముం దున్న స్థలాన్ని వ్యాపార సముదాయంగా మార్చే ప్రయత్నాలు చేస్తు న్నారని అన్నారు. సభ్యత్వ రుసుము పెంచి బైలాస్‌లో నిబంధనలను మార్చారని అన్నారు. ఇప్పటికే ఎన్నికల విష యంలో హైకోర్టులో పిటి షన్ దాఖలు చేశానని ఎన్నికల అధికారికి, బాపూజీ వచనాలయ కార్య దర్శికి నోటీసులు ఇచ్చారని అన్నారు. నాలుగు వారాలు ఎన్నికలు ఆపా లని ఇచ్చినప్పటికీ ఆపలేదని ఈ విష యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని అన్నారు. బాపూజీ వచనాలయం కోసం మరో ఉద్యమానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆయన పిలుపు నిచ్చారు.

తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం తగదు : మాజీ ఎమ్మెల్సీ



బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్



డిచ్‌పల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



ఏర్గట్లలో..

సుభాష్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమం సమయంలో రూపకల్పన చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం తగదని మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో వేలకొద్ది తెలంగాణ తల్లి విగ్రహాలను ఊరూరా ఏర్పాటు చేశామన్నారు. ఎవరు అభ్యంతరం చెప్పారని తెలంగాణ తల్లి రూపాన్ని మార్చారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తలరాతలు మారాలి తప్ప.. తల్లులను మార్చడం అతిపెద్ద తప్పు అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారితే తల్లి మారిందా, కాంగ్రెస్ నుంచి బీజేపీ వస్తే భారతమాత మారిందా అని సీఎంను ప్రశ్నించారు. నగర మేయర్ దండు నీతూకిరణ్ మాట్లాడుతూ.. బతుకమ్మను మాయం చేయడం తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడికి పరాకాష్ట అని అన్నారు. యావత్ జాతికి జాగృతి పర్చిన తెలంగాణ తల్లి ఒక పార్టీకో, వ్యక్తికో సంబంధించినది కాదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అస్తిత్వానికి చిహ్నాలు అయిన బతుకమ్మను, బతుకమ్మ చీరలను, బతుకమ్మ ఆటపాటలను చెరిపి రానున్న రోజుల్లో తెలంగాణను మాయం చేసే కుట్రలకు తెగబడుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర అధ్యక్షుడు సిర్పరాజు, రాంకిషన్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, సూదం రవిచందర్, సత్య ప్రకాశ్, సుజిత్‌సింగ్‌ఠాకూర్, నవీద్ ఎక్బాల్, తెలంగాణ శంకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విగ్రహాలను మారిస్తే తెలంగాణ చరిత్ర మారాదు..

డిచ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రూపుదిద్దుకున్న తల్లితెలంగాణ విగ్రహాలను మార్పు చేసి సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేయడం అర్థరహితమని ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌మోహన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చింత మహేశ్, శక్కరికొండ కృష్ణ, ఒడ్డం నర్సయ్య, పద్మరావు, డిచ్‌పల్లి, ధర్పల్లి, ఇందల్వాయి, మోపాల్, సిరికొండ, జక్రాన్‌పల్లి మండలాల నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి కాదు.. కాంగ్రెస్ పార్టీ తల్లి

ఏర్గట్ల: సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించింది తెలంగాణ తల్లి విగ్రహం కాదని, అది కాంగ్రెస్ పార్టీ తల్లియని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూల మాల వేసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మలిదశ ఉద్యమంలో, ఎందరో ఉద్యమకారులు తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచే విధంగా తెలంగాణ తల్లిని రూపకల్పన చేశారని, కానీ ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి హస్తం గుర్తు ప్రతిబింబించేలా కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం, మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలను అవమానించడమే..

ముప్కాల్: తెలంగాణ తల్లి విగ్రహాన్ని మర్చడమంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనని డీసీసీబీ డైరెక్టర్ మండల అధ్యక్షుడు నాగంపేట్ శేఖర్ అన్నారు. మంగళవారం మండలం బుస్సాపూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తలారి గంగాధర్, నవీన్‌గౌడ్, కమలాకర్, మచ్చర్ల రాజారెడ్డి,గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నీచరాజకీయాలకు పాల్పడుతోంది..

సదాశివనగర్: తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నీచరాజకీయాలకు పాల్పడుతోందని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆరోపించారు. సచివాలయం వద్ద ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహారూపు మార్పునకు నిరసనగా సదాశివనగర్ మండలం వజ్జపల్లితండాలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రభుత్వం తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చి పార్టీ ప్రతిష్టను పెంచుకునే విధంగా దిగజారిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, గాంధారి మండల పార్టీ అధ్యక్షుడు వజీర్ శివాజీ రావు, శ్రీనివాస్‌నాయక్, బుచ్చయ్య కపిల్‌రెడ్డి, నాగగౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో అసమర్థ పాలనసాగుతోంది..

బిచ్కుంద: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థ ప్రభుత్వ పాలన సాగుతుందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలోని కమ్మరి చెరువు ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేసిన అమరవీరుల స్థూపానికి నివాళ్లు అర్పించి, తెలంగాణ తల్లి విగ్రహానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో ఇచ్చిన 420 వాగ్దానాలలో ఒకటి కూడా ఖచ్చితంగా అమలుచేసినట్లు చెప్పుకునే పరిస్థితులలో లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు వెంకట్రావుదేశాయ్, సీనియర్ నాయకులు నాల్చార్‌రాజు,రాం చందర్, బాలు,మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట: మండల కేంద్రంలో తెలంగాణ తల్లి చిత్ర పటానికి మండల బీఆర్ఎస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సిద్దయ్య, మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మండల బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సొసైటి చైర్మన్ నర్సింలు, మండల బీఆర్ఎస్ మైనారిటీ అధ్యక్షులు ఫరీద్, నాయ కులు దుర్గారెడ్డి, కాంతం, వంశీ గౌడ్, హన్మంత్ రెడ్డి, సుధాకర్, మల్లేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నాయకులు క్షీరాభిషేకం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ తల్లి పేరుతో కాంగ్రెస్ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేసి పట్ల నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి మోర్తాడ్, వేల్పూర్ మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహానికి యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమ్‌గల్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాలం నుంచి రాష్ట్ర ప్రజల మదిలో నిండిపోయిన తెలంగాణ తల్లి రూపాన్ని మారుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని నిరసనగా భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సయ్య, నాయకులు రవి, సుమన్, శర్మనాయక్, మోయిస్, భగత్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని రాష్ట్రంలో మార్పు తెస్తామని టీఎస్ బదులుగా ఈజీగా అలాగే తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా మార్చి కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేశారని మండిపడ్డారు. మార్పు అంటే ఇదేనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్, సొసైటీ చైర్మన్ నర్సింలు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో గల తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మైనారిటీ రాష్ట్ర నాయకులు రజాక్ మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి పేరు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చిందని ఆరోపిస్తూ నిరసనగా తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ కవిత ఆదేశాల మేరకు శాంతియుతంగా నిరసన చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పెరిక రామకృష్ణ, రవి శంకర్ గౌడ్, జలం మాజీ సర్పంచ్ సాయిలు, సయ్యద్, హబీద్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ తల్లికి రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుల పిలుపు మేరకు మండల బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఇందులో సొసైటీ చైర్మన్ నల్లవెల్లి కపిల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ముదాం నర్సింలు, నాయకులు రాజా గౌడ్, మండల సొసైటీ ఉపాధ్యక్షులు ధర్మారెడ్డి, యూత్ అధ్యక్షులు రమేష్ రావు, నర్సింలు, మంగారెడ్డి, దెబ్బెట్టి సంజీవ్, సంజీవరెడ్డి రాజు, నర్సారెడ్డి, నర్సింలు మండల టీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ : మండలం కొత్తపల్లి గ్రామంలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపుమార్చడం సమంజసంకాదని, కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి బతుకమ్మను లేకుండా ఆవిష్కరించడం సరైందికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ మండల నాయకులు సామ వెంకట్‌రెడ్డి, బద్దం నర్సారెడ్డి, నిమ్మల నర్సయ్య, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండల కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి మండల బీఆర్ఎస్ నేతలు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి మాజీ ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ గౌడ్, మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి, మాజీ రైతు బంధు అధ్యక్షులు నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పడిగెల శ్రీనివాస్ గుప్తా, రాజేందర్ గౌడ్, మల్లేష్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు రెడ్డి, మల్లేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న హన్మంత్‌షిండే



ఎల్లారెడ్డిలో..



నాగిరెడ్డిపేటలో..

అంకాపూర్‌లో మొక్కలను నాటిన యూత్ అసోసియేషన్ సభ్యులు

ఆర్మూర్‌రూరల్,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో మంగళవారం గంగాదేవి యూత్ అసోసియేషన్ సభ్యులు మొక్కలు నాటారు. మార్కెట్ ప్రాంతం నుంచి రైల్వే బ్రిడ్జి వరకు రోడ్లకు ఇరువైపుల 40మొక్కలను యూత్ సభ్యులు నాటాగా మొక్కల రక్షణకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ట్రీగార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగాదేవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, సాగర్, ఆంజనేయులు, గుడిరెడ్డి రైతు సంఘం అధ్యక్షుడు నల్ల చిన్న అనంత్, చిన్న గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని సీట్లను కైవసం చేసుకుంటాం

● మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్

నవీపేట,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అన్ని సీట్లను కైవసం చేసుకుంటుందని మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు ఒక్క తాటిపై పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, భగవాన్, నవీన్ రాజ్, విజయ్, చామంతి రాజు, బాల చందర్ గౌడ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలి

డిచ్‌పల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):రాష్ట్రప్రభుత్వం వర్సిటీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి టీచింగ్, నాన్ టీచింగ్ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కమిటీ సభ్యుడు రఘురాం డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ వర్సిటీలో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రఘురాం మాటాడుతూ.. విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాలన చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో వర్సిటీల సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయలన్నారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రహీమాన్, వర్సిటీ కన్వీనర్ సాయి, కోకన్వీనర్ సంజయ్,చందు, గౌతమ్, మోక్షిత్, రవీందర్, విజయ్, విఘ్నేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

నీలకంఠేశ్వర ఆలయ హుండీ లెక్కింపు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న నీలకంఠేశ్వర ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమీషనర్ విజయరామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో ఆలయానికి 3లక్షల 5,917 రూపాయలు ఆదాయం సమకూరింది. ఆదాయంలో 2లక్షల 79,381 రూపాయల నోట్లు రాగా, నాణెల రూపంలో 26,536 రూపాయలు ఆదాయం వచ్చింది. ఆదాయంలో 30 గ్రాముల 100 మిల్లీగ్రాముల బంగారం, ఒక కేజీ 900 గ్రాముల 100 మిల్లీగ్రాముల వెండి వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి రవీందర్‌గుప్త, అర్చకులు, ఆలయ సిబ్బంది, విష్ణుసహస్రనామ పారాయణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



మృత దేహాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ సలహాదారులు

అంత్యక్రియలో పాల్గొన్న పోచారం

బాన్సువాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేదిన బిక్నూర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బాన్సువాడకు చెందిన మాజీ సర్పంచ్ దివంగత కొర్ల సంగారెడ్డి కూతురు కంచర్ల లక్ష్మీ, ఆమె కుమారుడు కంచర్ల అక్షయ్‌రెడ్డిలు మరణించారు. వారి అంత్యక్రియలు మంగళవారం బాన్సువాడ పట్టణంలోని పాత బాన్సువాడలో తమ స్వగృహం వద్ద జరిగాయి. ఈ అంత్యక్రియల్లో ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిలు పాల్గొని పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

సీఎం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి

● లేకుంటే మార్చి తరువాత ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

● బాన్సువాడ మండల మలిదశ ఉద్యమకారుల ఫోరం డిమాండ్

బాన్సువాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మలిదశ ఉద్యమకారులతోపాటు తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు ఆదుకుంటామని వాగ్దానం చేసిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని బాన్సువాడ మండల మలిదశ ఉద్యమకారుల ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మలిదశ ఉద్యమకారులు మాట్లాడుతూ 2023 ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలో అమలు చేస్తామని చెప్పి ఆరో గ్యారెంటీ మల్లీ దశ ఉద్యమకారులకు తెలంగాణ కోసం అమరులైన కుటుంబాలకు 25 వేల పింఛన్‌తో పాటు 250 గజాల స్థలం 25 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని చెప్పి నేటికీ అమలు చేయకపోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు. గత 11 నెలలు గడుస్తున్న పట్టించుకోవడంలేదని వెంటనే సీఎం రేవంత్ రెడ్డి అమరుల కుటుంబాలకు ఉద్యమకారులకు ఇచ్చిన మాట ప్రకారం న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు బాన్సువాడ ఉద్యమకారులను పిలుస్తారని ఎదురు చూసినప్పటికీ నిరాశనే కనబడిందని వారు తెలిపారు . ఈ కార్యక్రమంలో మలిదశ ఉద్యమకారులు ఉడుత గంగాధర్, చందు, విజయ్, సాయిబాబా, కృష్ణ, భాస్కర్ గౌడ్, మహేష్, సాయిలు, సురేష్, మారుతి, బీమా నాయక్ తదితరులుపాల్గొన్నారు.

ఇరు కుటుంబాల గొడవ

● ఇద్దరికి గాయాలు ● ఏడుగురిపై కేసు నమోదు

నవీపేట,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ ఏరియాకు చెందిన యాదగిరి, అతని బావ రమేష్ కుటుంబాల మధ్యన సోమవారం రాత్రి జరిగిన గొడవలో యాదగిరి కుమారుడు అరవింద్, అతని బావ రమేష్‌లకు గాయాలయ్యాయని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఇంటి అద్దె విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవ జరుగగా యాదగిరి కుమారుడు అరవింద్ పొట్టలో పదునైన ఆయుధంతో దాడి చేయగా అతనికి తీవ్రమైన గాయమైందని బాధితుడిని వెంటనే మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించడం జరిగిందని అన్నారు. అలాగే రమేష్ తలకు సైతం గాయాలు కాగా అతనిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ దాడికి సంబంధించి ఇరుపక్షాలకు చెందిన ఏడుగురిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుల దుర్మరణం

జక్రాన్‌పల్లి,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి):జక్రాన్‌పల్లిలో మండలం సికింద్రాపూర్‌వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఎస్సై తిరుపతి కథనం ప్రకా రం.. నిజామాబాద్ చెందిన అంకడి సంజయ్ (21) కస్తూరి ప్రమోద్(22) బైకుపై ఆర్మూర్‌కు వచ్చారు. సాయంత్రం డిచ్‌పల్లి మీదుగా నిజామాబాద్ బయలుదేరారు.బైక్‌పై వెళ్తుండగా సికింద్రాపూర్ వద్ద ఆగివున్న లారీని ఢీకొట్టారు. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికిచేరుకొని మృతదేహాలను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

అక్రమ నిర్మాణ పనులను ఆపాలి

మోపాల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని ఆకుల కొండూర్ గ్రామంలో అక్రమంగా నిర్మాణమవుతున్న చర్చి పనులను ఆపాలని గ్రామాభివృద్ధి కమిటీ పెద్దలు దేవదాసు, గణేష్, భోజన్న, నర్సయ్య, యూత్ సభ్యులు మంగళవారం గ్రామ కార్యదర్శి ఉమాకు ఫిర్యాదు చేశారు. ఎటువంటి అనుమతి లేకుండా పనులు చేయడం పట్ల చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ విషయమై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. గ్రామంలో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే తగు చర్యలు ఉంటాయని గ్రామస్తులకు సూచించినట్లు కార్యదర్శి తెలిపారు.

సోనియాగాంధీ చాలెంజ్ ట్రోఫీ టోర్నీలో టెక్నికల్ ఆఫీసర్‌గా పచ్చలనడ్కుడ వాసి

వేల్పూర్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): సోనియాగాంధీ చాలెంజ్ ట్రోఫీ (71వ ఇంటర్ డిస్ట్రిక్ మహిళ కబడ్డీ చాంపియన్‌షిప్) టోర్నీలో టెక్నికల్ ఆఫీసర్‌గా వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన అశీల అనిల్‌కుమార్ వ్యవహరించారు. ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ.స్టేడియంలో జరిగిన ఈ టోర్నీలో ఆయన టెక్నికల్ ఆఫీసర్‌గా వ్యవహరించడం పట్ల రాష్ట్ర విత్తనాభివృద్ధి చైర్మన్ అన్వేష్‌రెడ్డి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు టక్కరి గంగాధర్, పలువురు గ్రామస్థులు, స్థానిక వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు అనిల్ కుమార్‌ను అభినందించారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



నసురుల్లాబాద్‌లో బెల్టుషాపులకు మద్యం విక్రయిస్తున్న వైన్‌షాపు

జోరుగా సిట్టింగులు!

● పుట్టగొడుగుల్లా బెల్టుషాపులు ● మత్తుకు బానిస అవుతున్న యువత
● పట్టించుకోని అబ్కారీ, పోలీసు అధికారులు



నసురుల్లాబాద్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. గ్రామాల్లో బెల్ట్‌షాపుల ద్వారా మద్యం మత్తులో యువత పెడదారి పడుతున్నారు. యువత భవిష్యత్తు మత్తులోకి మునిగి తేలుతున విషయాన్ని మర్చిపోయి ప్రస్తుతం గ్రామంలో వీధికో బెల్ట్ షాప్ ఏర్పాటుచేయడంతో యువకుల భవిష్యత్తు మత్తులోనికి వెళ్తోంది. గతంలో పల్లెల్లోని ప్రతీ గ్రామంలో బెల్టు షాపు ఉండేది. కానీ ప్రస్తుతం గ్రామంలోని వీధిలో వీధికో బెల్ట్‌షాప్ ఏర్పాటు చేయడంతో యువకుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తయారైంది. దీని మూలంగా యువకుల జీవితం అంధకారంలోనికి వెళ్లిపోతోంది. సంబంధిత అధికారులు ఏమీ పట్టించకపోవడంతో పోటీపడి మరి బెల్టుషాపులు గ్రామంలో పుట్టగొడుగుల్లా దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో బహిరంగంగా వేలంపాట ద్వారా బెల్ట్‌షాపులు బెల్ట్‌షాప్‌ల నిర్వాహకులు మద్యంప్రియుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. బెల్ట్‌షాపులో అధిక ధరకు మద్యం అమ్మడం, వంటి కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ పట్టించుకోనే నాథుడే కరువయ్యాడు. బెల్ట్‌షాపులపై కొరడా ఝులిపించాలని ఆదేశించిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. గ్రామంలో బెల్ట్‌షాపులు రాజ్యమేలుతున్నాయి. అధిక ధరకు మద్యం విక్రయించడం ద్వారా అప్పుచేసి మరి యువత మద్యం కొనుగోలు చేసి మత్తులో తూలుతున్నారు. కాగా దీని వ్యసనంగా గ్రామీణ ప్రాంతాలలో క్రైమ్ రేట్ పెరిగిపో వటానికి పరోక్షంగా బెల్ట్‌షాపులే ప్రధాన భూమిగా పోషిస్తున్నాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు సమయపాలన పాటిస్తూ మరి మద్యం విక్రయిస్తున్నాయి. గ్రామాల్లో పగలు రాత్రి, అని తేడా లేకుండా అడ్డూఅదుపు లేకుండా 24గంటలు బెల్ట్ షాపులు నడపడం వలన బెల్ట్‌షాపులో మద్యం లభించడంతో గ్రామాల్లో వేకువజాము నుంచి యువకులు అనేక ఆ సాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా మద్యం వ్యాపారులు ఎంఆర్‌పీ ధరకు మద్యం విక్రయించకుండా అధిక ధరలకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మద్యం విక్రయబాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలకు కూత వేటు దూరంలో వైన్స్

మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి ఎక్స్ రోడ్డు వద్ద కూతవేటు దూరంలో ఓ ప్రైవేట్ పాఠశాల ఉంది. వైన్స్ యజమానులు నిబంధనలను తుంగలో తొక్కి ఆ పాఠశాలకు దగ్గర్లోనే మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు దూరంగా వైన్స్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అబ్కారీశాఖ, పోలీస్‌శాఖ వైన్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలని బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.



రహదారికి ఆనుకుని ఉన్న వైన్‌షాపు

వెక్కిరిస్తున్న సిబ్బంది కొరత

● వంద పడకల ఆస్పత్రికి ఇద్దరే వైద్యులు ● మిగతా వారంతా డిప్యూటేషన్‌పైనే విధులు
● పదుల సంఖ్యలో వైద్య, పారామెడికల్ సిబ్బంది ఖాళీలు ● ఆర్మూర్ వంద పడకల ఆసుపత్రికి రెండేళ్లు పూర్తి
● అన్నివసతులు ఉన్నా అత్యవసర పరిస్థితుల్లో అందని వైద్యం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 100 పడకల ఆసుపత్రి ఏర్పాటై రెండేళ్లు గడిచినా సిబ్బంది కొరత వేధిస్తూనే ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్యాడర్ స్ట్రెంత్ కేటాయించకపోవడంతో నేటికీ ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లు డిప్యూటేషన్ పైనే విధులు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్‌లతో పాటు 25మంది స్టాఫ్ నర్సులు మాత్రమే డైరెక్ట్‌గా రిక్రూట్ కాగా, మిగతా వైద్యులు భీమ్‌గల్, బోధన్ మండల కేంద్రాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. 100 పడకల ఆసుపత్రిలో 109 పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాల్సి ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రజల అవసరాలను తెలుసుకొని 30 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుకు భవనాన్ని నిర్మించగా రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో వైద్యవిధాన పరిషత్‌లో వంద పడకల ఆసుపత్రిగా మార్చారు. అప్పటినుంచి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌లు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్ని విభాగాల్లో బదిలీలు చేపట్టగా పలువురు డాక్టర్లు ఆర్మూర్ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహించడానికి సుముఖత వ్యక్తం చేయగా ప్రస్తుత ప్రభుత్వం సైతం క్యాడర్‌స్ట్రెంత్ కేటాయించకపోవడంతో పలువురు డాక్టర్‌లు భీమ్‌గల్‌లో పోస్టింగ్ తీసుకొని అక్కడ భవనంపూర్తి కావడంతో ప్రస్తుతం ఆర్మూర్‌లోని ఏరియా ఆసుపత్రిలో డిప్యూటేషన్‌పై విధులను నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారు. నిత్యం కొన్ని వందల సంఖ్యలో ఆసుపత్రికి వివిధ సమస్యలతో రోగులు వస్తున్న వారికి అత్యవసర సేవల కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి లేదా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

సిబ్బందిని కేటాయించాలని డిమాండ్

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వైద్యఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వైద్యవిధాన పరిషత్ కమిషనర్ సైతం ఆసుపత్రిని సందర్శించారు. క్యాడర్‌స్ట్రెంత్ కేటాయించకపోవడంతో బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు నిరాశ చెందారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం క్యాడర్‌స్ట్రెంత్ కేటాయించి ఖాళీఉన్న సీట్లను భర్తీ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భీమ్‌గల్‌లో నిర్మాణంలో ఉన్న వందపడకల ఆసుపత్రి పూర్తయితే ఆర్మూర్ ఆసుపత్రిలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న డాక్టర్‌లు, ఉద్యోగులు భీమ్‌గల్ ఆసుపత్రికి పోవాల్సి వస్తోంది. దీంతో ఆర్మూర్ ఆసుపత్రిలో డాక్టర్ల కొరత పూర్తిగా ఏర్పడుతుంది. పేరుకే వంద పడకల ఆసుపత్రిగా ఉన్న క్యాడర్‌స్ట్రెంత్ లేకపోవడంతో ప్రజలు ఎక్స్‌రే, స్కానింగ్‌లతోపాటు అత్యవసర సేవల కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సి వస వస్తోంది. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆర్మూర్ ఏరియా ఆసుపత్రికి క్యాడర్‌స్ట్రెంత్ కేటాయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అన్ని పోస్టులూ ఖాళీనే..

వంద పడకల ఆసుపత్రిలో ఫార్మసిస్ట్, ఫిజియోథెరపిస్ట్, స్టాఫ్ నర్సులు డైరెక్టర్‌గా రిక్రూట్ కాగా పది మంది సివిల్ సర్జన్‌లు, స్పెషలిస్టులు ఉండాల్సి ఉండగా ఇద్దరు భీమ్‌గల్ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఎనిమిది మంది డిప్యూటీ సివిల్‌సర్జన్‌లు ఉండాల్సి ఉండగా ఒకరు భీమ్‌గల్, మరొకరు బోధన్ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చారు. ఒక డిప్యూటీ డెంటల్ సర్జన్ ఉండాల్సి ఉండగా డీహెచ్‌వో నుంచి డెంటల్ సర్జన్‌ను కేటాయించారు. ఇద్దరు సీనియర్ అసిస్టెంట్‌లకు ఒకరు భీమ్‌గల్ నుంచి డిప్యూటేషన్‌పై ఉన్నారు. నలుగురు ల్యాబ్ టెక్నిషయన్‌లకు ఒకరు భీమ్‌గల్ నుంచి డిప్యూటేషన్‌పై ఉన్నారు. ఇద్దరు థియేటర్ అసిస్టెంట్‌కు ఒకరు భీమ్‌గల్ నుంచి డిప్యూటేషన్‌పై పనిచేస్తుండగా, ఒక నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2, ఐదుగురు హెడ్‌నర్సులు, ఒక అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, హెల్త్‌ఇన్‌స్పెక్టర్, ఒక రిసెప్షనిస్ట్, ఒక జూనియర్ అనాలిస్టు, ఒక ఆఫీస్ సూపరింటెండెంట్, నలుగురు ఏఎన్‌ఎంలు, ముగ్గురు ఫార్మసిస్ట్ గ్రేడ్-2, ఇద్దరు రేడియోగ్రాఫర్లు, ఒక డార్క్ రూం అసిస్టెంట్, ఒక ఆప్తాల్మిక్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్ ఒక ల్యాబ్ అటెండెంట్‌లు ఖాళీలు ఉన్నాయి.



ఓపీలో పేరు నమోదు చేసుకుంటున్న రోగులు



ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న రోగులు

నాయకులూ ఒకసారి ఇటువైపు చూడరూ..

సోషల్ మీడియాలో ప్రగల్భాలు పలుకుతూ డాక్టర్లను మేము తెచ్చామంటే మేము తెచ్చామని చెప్పుకుంటున్న నేతలూ ఒక్కసారి ఆసుపత్రి వైపు చూడాలని ప్రజలు కోరుతున్నారు. అత్యవసర సేవల కోసం జిల్లా ఆసుపత్రికి వెళ్లలేక ప్రైవేటు ఆసుపత్రిల్లో బిల్లులు కట్టలేక అప్పులపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి అత్యవసర సేవలను సైతం అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

తక్షణమే అన్ని పోస్టులను భర్తీ చేయాలి

● బోడమీది నర్సయ్య, ఆర్మూర్



ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేసి మందుల కొరత లేకుండా చూడాలి. అత్యవసర సేవలు ప్రతీ ఒక్కరికి అందేలా చర్యలు చేపట్టాలి.



తాళం వేసి ఉంచిన ఐసీయూ

తమిళనాడులో పసుపు మార్కెట్‌ను సందర్శించిన వేల్పూర్ ఏఎంసీ కార్యవర్గ సభ్యులు



గోదాంలో నిల్వ ఉంచిన పసుపు బస్తాలను పరిశీలిస్తున్న కార్యవర్గ సభ్యులు

వేల్పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో వెళ్లిన స్టడీ టూర్‌లో భాగంగా వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గ సభ్యులు మంగళవారం తమిళనాడులోని ఈరోడ్ పసుపు మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులను కార్యవర్గ సభ్యులు పలు విషయాలపై అడిగితెలుసుకున్నారు. రైతులు పసుపును అమ్ముకోవడానికి ఎటువంటి సహకారం అందిస్తున్నారని, తక్కువ ధర వచ్చినప్పుడు పంటను నిల్వచేసుకోవడానికి రైతులు అనుసరిస్తున్న విధానాలు, సలహాలు, సూచనలను అక్కడి అధికారుల ద్వారా అడిగారు. రైతులు తమ పసుపు బస్తాలను ముందుగా మార్కెట్ కమిటీ గోదాంలో నిల్వ చేసుకోవాలన్నారు. తర్వాత పంటను అమ్ముకోవాలని, అనుకుంటే పసుపు బస్తాల నుంచి కొంత నమూనాగా పసుపును ఒక ట్రేలో బిట్ జరిగే హాల్‌లో ఉంచిన వాటికి టోకెన్ నెంబర్ ఇవ్వడం జరుగుతుందని అధికారులు తెలిపారు. వ్యాపారంచేసే వ్యక్తులు ట్రెలో ఉన్న పసుపును పరిశీలించి ఆన్‌లైన్ మొబైల్ యాప్ ధర వేస్తారన్నారు. ఏ వ్యాపారి ఎక్కువ ధర వేస్తారో వారికి వచ్చినట్టు స్ర్కీన్ మీద డిస్‌ప్లే చేయడం జరుగుతుందని అధికారులు వివరించారని, ఏఎంసీ చైర్మన్ ముత్యంరెడ్డి తెలిపారు. కాగా మన ప్రాంతంలో రైతులు మార్కెట్‌కు తెచ్చిన పసుపు కుప్పగా పోసి టోకెన్ నెంబర్ ఇస్తారు. మంచి ధర వచ్చినా రాకున్నా ఇవ్వావాల్సిన పరిస్థితి ఉంది. కానీ ఇక్కడ రైతులకు గోదాంలో పంటను నిల్వ చేసుకునే సౌకర్యం ఉన్నందున మంచిధర వచ్చినప్పుడే అమ్ముకునే వెసులుబాటు ఇక్కడ రైతులకు ఉందని తాము గ్రహించామని ఏఎంసీచైర్మన్, వైస్ చైర్మన్లు ముత్యంరెడ్డి, గడ్డంనర్సారెడ్డి తెలిపారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థులు



జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

జక్రాన్‌పల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 68వ స్కూల్ గేమ్స్ అండర్-17 జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్టు వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్ మంగళవారం తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో జక్కం పవన్ పాల్గొని రజత పతకం అందుకున్నారు. బాలికల విభాగంలో సాంబరు నిత్యశ్రీ, సరిత రజత పతకాలు సాధించారు. మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలో జనవరి 5నుంచి 9వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఎంఈవో శ్రీనివాస్, వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్, ఉపాధ్యాయులు, వీడీసీసభ్యులు అభినందించారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

మాక్లూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు మరింత లాభాలు గడించవచ్చని ఉద్యానవన శాఖ మాజీ డైరెక్టర్ లోక వెంకట్రాంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పది ఎకరాల్లో సాగు చేస్తున్న ప్రసాద్ అనే రైతు తోటలు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ డిమాండ్ గురించి రైతులకు వివరించారు. ప్రపంచంలో అత్యధిక దిగుబడిని నూనె గింజల పంటలో ఆయిల్‌ఫాం పంట ఒకటని అన్నారు. ప్రతీరైతు ఆయిల్‌ఫాం పంటపై దృష్టిసారించి వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక లాభాలు గడించాలని అన్నారు. అనంతరం రైతు ప్రసాద్‌ను సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో కొమురెల్లి మల్లన్నకు పూజలు



మల్లన్నస్వామికి నియమాలతో వండుతున్న మహిళలు

వేల్పూర్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలోని కొమురెల్లి అగ్గుమల్లన్న స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించుకున్నారు. పచ్చలనడ్కుడతోపాటు ఇతర గ్రామాల నుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్‌లు, ఆటోలపై ప్రజలు వచ్చి ప్రత్యేక నియమాలతో ఉంటూ కొమరెల్లి మల్లన్నస్వామికి పూజలు నిర్వహించారు. సోమవారం జరిగిన జాతర, రథోత్సవం జరిగిన మారుపటిరోజు మంగళవారం నడ్కుడ గ్రామానికి చెందిన భక్తులు వారి బంధువులతో కలిసి కొమురెల్లి మల్లన్న దేవునికి ఐదు రకాల చిరుధాన్యాలతో ఉడికించిన నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి వేళలో అగ్గుమల్లన్న భక్తులు అగ్నిగుండం దున్నడం, మల్లన్న స్వామి నాగవెల్లి వంటి కార్యక్రమాలను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రహదారిపై ప్రమాదకరంగా గుంతలు



డొంకేశ్వర్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత

డొంకేశ్వర్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ ప్రధాన రహదారిపై గుంతలు ప్రమాదకరంగా మారాయి. ప్రాణాలు పోయేలా గుంతలు ఏర్పడ్డ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వాహనాలు ప్రయాణి ంచేటప్పుడు తరుచూ గుంతల్లో కూరుకుపోయి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రివేళల్లో గుంత కనబడక వేగంతో వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అన్నారం, నుంచి డొంకేశ్వర్ వెళ్లేమార్గంలో డొంకేశ్వర్ మండల కేంద్రంలో భారీగుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బంది లు పడుతున్నారు. గత 8నెలల నుంచి ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. వర్షం కురిసినప్పుడు ఆ నీరు నిలిచి గుంత ఎక్కడ ఉందో తెలియక వాహనదారులు ప్ర మాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులైనా చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లోనూ రాణించాలి

● క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయి: సబ్‌కలెక్టర్ వికాస్ మహతో



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సబ్‌కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్



హంగర్గ ఫారం ప్రాథమికోన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని, క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని విజయమేరి పాఠశాలలో సీఎం కప్ క్రీడ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే విద్యార్థులు క్రీడాలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. సీఎం కప్‌క్రీడ పోటీల సందర్భంగా క్రీడాల పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, పట్టణ సీఐ వెంకట నారాయణ, ఎంపీడీవో బాల గంగాధర్; ఎంఈవో నాగయ్య, కౌన్సిలర్లు మీర్ నజీర్ అలీ, అబ్దుల్లా, అలీం రజా, శ్రీకాంత్ గౌడ్, ధూప్‌సింగ్, పీఈటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందించాలి

కోటగిరి: చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని మరింత పెంపొంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో సూచించారు. పోతంగల్ మండలంలోని హంగర్గ ఫారం ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. కొందరు విద్యార్థులు చదువులో వెనుకబడి ఉండడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలకు వచ్చిన సబ్ కలెక్టర్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిత, ప్రశాంత్ కిరణ్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలూ అవసరం

జక్రాన్‌పల్లి: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని ఈ క్రీడలు భవిష్యత్‌లో ఉపయోగపడుతాయని మాజీ ఐడీసీ ఎంఎస్ చైర్మన్ సాయిరెడ్డి అన్నారు. మంగళవారం జక్రాన్‌పల్లిలోని ఆదర్శ పాఠశాలలో మండలస్థాయి సీఎంక్రప్ క్రీడలను మాజీఐడీసీఎంఎస్ చైర్మన్ ఎం.సాయిరెడ్డి, అధికారులు కలిసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నారెడ్డి, బ్రాహ్మణ్‌పల్లి, కొలిప్యాక్ సింగిల్ విండోల చైర్మన్‌లు కాట్‌పల్లి నర్సారెడ్డి, నాగుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బాలుర జట్టును అభినందిస్తున్న మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్



నెమలి సాయిబాబా ఆలయంలో ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

కృత్రిమ కాళ్లు, ట్రై సైకిళ్ల పంపిణీ

నసురుల్లాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నెమిలి షిరిడి సాయిబాబా ఆలయంలో మంగళవారం దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ట్రై సైకిళ్లను ఎన్ఆర్ఐ పటోళ్ల మోహన్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు నందు పటేల్ మాట్లాడుతూ దైవ సన్నిధిలో 110 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారన్నారు. కాగా నెమిలి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ పటోళ్ల మోహన్‌రెడ్డి అమెరికాలో స్థిరపడి, తాను పుట్టి పెరిగిన గ్రామం కోసం ప్రజల తనవంతుగా సేవలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, ఆలయ కమిటీ సభ్యులు, మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ ఉప సంఘం హామీ ఇచ్చిన విధంగా పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో టీపీటీఎఫ్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. తొమ్మిది నెలల నుంచి విడుదలకు నోచుకోక ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్యవర్గసభ్యులు సీహెచ్ లక్ష్మీ, విజయశ్రీ, తృప్తి శ్రీనివాస్, హరిసింగ్ నరేందర్, గోపి శ్రీనివాస్, సీహెచ్ ప్రకాష్, కృష్ణ, కృష్ణమూర్తి, హరీష్, కేఎన్ భగత్, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోక్సోచట్టంపై అవగాహన

గాంధారి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎల్లారెడ్డి డివిజన్ షీ టీం, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో పోక్సో చట్టం, లింగ సమానతలపై, ఆర్థిక అక్షరాస్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని పోక్సో చట్టం ఏ విధంగా అమలు చేస్తారనే దానిపై వివరించడంతో పాటు లింగ సమానత్వాన్ని పెంపొందించాలని ఆడ పిల్లలు ఉన్నత చదువులు చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుప్రజ, శిరీష, శారద, తులసి, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

భిక్కనూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గర్భిణులు తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని భిక్కనూరు వైద్యాధికారిణి డాక్టర్ దివ్య సూచించారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మఒడి కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు అమిత, హెచ్ఈవో వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో వాహనాల తనిఖీ

దోమకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనపత్రాలను పరిశీలించారు. నిబంధనలు పాటించని వాహన యజమానులకు జరిమాన విధించారు. ప్రతి ఒక్కరూ పోలీసు, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు వెంకటేష్‌గౌడ్, మహేష్, శ్రీకాంత్, స్వామి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కళాకారులు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో మంగళవారం ఉద్యోగ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి 9 మంది ఉద్యమకారులకు రూ.కోటి చొప్పున నిధులు ఇవ్వడంతో పాటు 300 గజాల స్థలం అందించడం ఆనందించదగిన విషయమని అన్నారు. మిగిలిన ఉద్యమ కళాకారులకు సైతం అదేవిధంగా ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయిలు యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, రాజలింగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికీ సీపీఎం'ను విజయవంతం చేయండి

కామారెడ్డి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ సీపీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం కామారెడ్డి పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 25 నుంచి నాలుగు రోజుల పాటు సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభలు జరుగుతున్నందున జిల్లా కేంద్రంలో ఇంటింటికీ సీపీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హాజరవనున్నట్లు తెలిపారు. జిల్లాలో రైతాంగ ఉద్యమాలు, కార్మిక, భూమి సమస్యలు, ఇంటి స్థలాల సమస్యలు, రైతు, వ్యవసాయ, విద్యార్థి, యువజన, మహిళ సమస్యల పరిష్కారానికి జిల్లా అభివృద్ధి ఎన్నో ఉద్యమాలు నిర్వహించి సీపీఎం పార్టీ ప్రజల పక్షాన నిలబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు వెంకట్‌గౌడ్, కొత్త నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు ముదాం అరుణ్, రేఖ, నర్సింలు, సత్యనారాయణ, బాలరాజు, హైమద్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు వెదజల్లే పద్ధతిని అనుసరించాలి

● మండల వ్యవసాయ శాఖ అధికారి భానుశ్రీ

రామారెడ్డి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో వెదజల్లె పద్ధతిని అనుసరించాలని రామారెడ్డి మండల వ్యవసాయశాఖ అధికారి భానుశ్రీ పేర్కొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలో మంగళవారం వ్యవసాయ భూముల్లో వరి పంటలో వెదజల్లే పద్ధతిపైన అవగాహన కల్పించారు. దీని వల్ల చాలా మంది రైతులు వెదజల్లే పద్ధతిని అనుసరిస్తున్నారు. ఈ వెదజల్లే పద్ధతి అనుసరించడం ద్వారా ఎకరానికి రూ.5వేల నుంచి 6 వేల వరకు ఆదా చేయవచ్చన్నారు. కూలీల కొరత అధిగమించవచ్చు. దీంతో ఘనంగా అధిక దిగుబడి వస్తుందని పలు సలహాలు, సూచనలు వివరించారు. రైతులు వెదజల్లే పద్ధతికి మొగ్గు చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ విస్తీర్ణ అధికారులు రాకేష్, నిఖితా, రైతులు బండి బాలరాజు, భాస్కర్, నరేష్‌గౌడ్, ఎర్రోళ్ల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో అట్టర్‌ప్లాప్ సీఎం రేవంత్‌రెడ్డి



బాన్సువాడలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బాజిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బాన్సువాడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కార్యకర్తలతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపురేఖలు లేకుండా కాంగ్రెస్ తెలంగాణ తల్లిగా తీర్చిదిద్ది తెలంగాణ తల్లికి అవమానపరిచేలా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం యావత్ తెలంగాణ ప్రజలు తలదించుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆయన మండిపడ్డారు. అనంతరం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాది పాలన పూర్తయ్యేసరికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అట్టర్‌ప్లాప్ సీఎంగా దేశంలోనే చరిత్రకు ఎక్కారని ధ్వజమెత్తారు. సీఎం ఇచ్చిన వాగ్దానాలను మర్చిపోయి ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్టుగా మాట్లాడడం సిగ్గుచేటని ఆయన ఆరోపించారు. కేసీఆర్‌తో పాటు వారి కుటుంబంపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసే ఉద్దేశంతో ప్రతీ సమావేశంలో కేసీఆర్‌పై ఆరోపణలు చేయడం సరైనది కాదని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కంటే ఎక్కువ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని అధికారంలోకి తీసుకువచ్చినా ఇప్పటి వరకు 50 శాతం రుణమాఫీ చేయకపోవడం పెంచిన పెన్షన్లను అమలు చేయకపోవడం 420 వాగ్దానాలు పూర్తిగా నీరుగార్చారన్నారు. మూసీ హైడ్రా తెలంగాణ తల్లి విగ్రహాల ఏర్పాటుతో మాయమాటలు చెప్పి పాలనను పక్కదారి పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ నాయకులు మోచి, గణేష్, సాయిబాబా, మహేష్, సద్దాం, రమేష్, సాయిలు, నర్సింలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో..



భిక్కనూరులో..

అట్టహాసంగా ప్రారంభమైన సీఎం కప్ పోటీలు



బాన్సువాడలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ/బాన్సువాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని మినీ స్టేడియంలో మండల స్థాయి, మున్సిపాలిటీ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్ ప్రారంభించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి మున్సిపాలిటీ పరిధిలోని క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటువంటి పోటీలు చాలా ఉపయోగపడతాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణ, ఎంఈవో నాగేశ్వరరావు, అధికారులు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో సీఎం కప్ పోటీలను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి దయానంద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆటల పోటీల్లో తమ యొక్క నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యకాంత్, ఎంఈవో చందర్, ఏఎస్ఐ వెంకట్‌రావు, గిరిజన గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాధవరావు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: మండల కేంద్రంలో సీఎం కప్‌ను అధికారులు ప్రారంభించారు. ఈ క్రీడలతో మండలాల్లో గ్రామాల్లో ఉన్న క్రీడాకారులను వెలికి తీయడంలో ఎంతో ఉపయోగపడుతుందని మండల అధికారులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారి సయ్యద్ సాజిద్ అలీ, తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీవో సవితారెడ్డి, ఎంఈవో రామస్వామి, ఉపాధ్యాయులు మనోహర్‌రావు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

గాంధారి: మండలంలోని పేట్‌సంగెంలో పోటిలను నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ పరమేశ్వర్ మాట్లాడుతూ యువకులు భవిష్యత్తుపై దృష్టి సారించి ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆంజనేయులు, ఎంపీడీవో రాజేశ్వర్, ఎంఈవో శ్రీహరి, ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి, రంగ వెంకటేశ్వర్‌గౌడ్, లక్ష్మణ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్: ప్రతీ క్రీడాకారుడు తనలోని ప్రతిభను చాటుతూ ఉత్తమ క్రీడాకారులుగా గుర్తింపు పొందాలని జడ్పీ సీఈవో చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో సీఎం కప్ క్రీడలను ఆయన ప్రారంభించారు. క్రీడలు ప్రశాంతంగా నిర్వహించాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ సంగ్యానాయక్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంఈవో యూసఫ్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: క్రీడలలో పాల్గొనే విద్యార్థులు గెలుపోటములను సమానంగా చూడాలని మండల ప్రత్యేకాధికారి నరేష్ అన్నారు. మండల కేంద్రంలోని సద్గురు బండాయప్ప స్వామి స్కూల్ ఆవరణ మైదానంలో ప్రభుత్వ పరంగా సీఎంక్రీడా మండల స్థాయి కోకో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భిక్కనూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి పోటీలను ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, ఎంఈవో రాజ్‌గంగారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనాథ్, పీడీ నర్సింహారెడ్డి, భిక్కనూరు గ్రామ పంచాయతీ ఈవో మహేష్‌గౌడ్, ఆయా పాఠశాలల పీఈటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమకొండ,(బీబీపేట): మండల కేంద్రంలో జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో సీఎం కప్ పోటీలను ప్రారంభించినట్లు ఎంపీడీవో పూర్ణచంద్రోదయ కుమార్ తెలిపారు. బాలురు బాలికలకు కబడ్డీ, వాలీబాల్ అథ్లెటిక్, ఖోఖో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సతీష్ యాదవ్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంఈవో ఆశోక్, ఎస్సై ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుతారి రమేష్, విండో చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాతరాజు, భూమాగౌడ్, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడలను తహసీల్దార్ నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక వ్యాయామంతో పాటు మానసిక వికాసానికి తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎంపీవో మలహరి, ఎంఈవో శౌకత్ అలీలతో పాటు మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఉన్నారు.

నాగిరెడ్డిపేట: మండల కేంద్రంలో క్రీడలను ఎంపీడీవో ప్రభాకర్ చారి ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, నెట్ బాల్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారిని రత్నం, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఏఎంసీ చైర్మన్ శ్యామల జ్యోతి ప్రజ్వల చేసి ఆటపోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైఎస్ చైర్మన్ యమ రాములు, మాజీ ఎంపీపీ రఘు, తహసీల్దార్ లత, ఎంపీడీవో భాను ప్రకాష్, ఎంఈవో వెంకన్న, జీపీ కార్యదర్శి గంగారాం, పీఈటిలు, నాయకులు ఆవారి గంగారాం, పాండు, సానేపు గంగారాం, తదితరులు పాల్గొన్నారు.



నస్రుల్లాబాద్‌లో..



తాడ్వాయిలో..



లింగంపేటలో..



నాగిరెడ్డిపేటలో..

ఆటో బోల్తా : పలువురికి గాయాలు

తాడ్వాయి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రపాటి శివారులో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి పలువురికి గాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. మోతె గ్రామానికి వారి బంధువుల అంత్యక్రియల్లో పాల్గొనేందుకు సుమారు 30మంది ఆటోలో వెళుతుండగా ప్రమాదవశాత్తు టైరు పేలి బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. అంబులెన్స్‌ను రప్పించి మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి పంపించినట్లు వారు తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

లింగంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోతె గ్రామానికి చెందిన బుయ్య పెంటయ్య(37) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. పెంటయ్య తండ్రి రాములు పేరుపై ఉన్న భూమిని కొడుకుకు కౌలుకు ఇవ్వకపోవడంతో పాటు తనకు రావాల్సిన వాట ఇవ్వడం లేదని తండ్రీ కొడుకుల మధ్య గొడవ జరగగా తండ్రి తనకు కౌలు ఇవ్వకుండా, వాట ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని మనస్థాపం చెంది ఈనెల 2న పెంటయ్య పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు అతనిని వెంటనే కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోతె వద్ద వాహనం బోల్తా : 15 మందికి గాయాలు

లింగంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని మోతె గ్రామ సమీపంలో టాటాఏస్ వాహనం బోల్తాపడి 15 మందికి గాయాలయ్యాయి. గాంధారి మండలం సీతాయిపల్లి నుంచి లింగంపేట మండలం మోతె గ్రామానికి వెళుతుండగా ప్రమాదం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. వారందరిని 108లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డవారి వివరాలు ఇలా ఉన్నాయి. లంక లక్ష్మి, చిందం శ్యామల, చాకలి లచ్చవ్వ, మోగుల శామల, మోగుల సురేఖ శెట్కూరి శామ, కారెం మంజుల, మొకిరె భైరవ్వ, రాసుపల్లి విఠవ్వ, దాసరి కాశీరాంలతో పాటు మరింత మంది ఉన్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

వేర్వేరు చోట్ల రెండు లారీలు బోల్తా

లింగంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్తాపూర్, మెంగారంలో సోమవారం రాత్రి రెండు లారీలు బోల్తా పడ్డాయి. ముస్తాపూర్ వద్ద లింగంపేట నుంచి కామారెడ్డికి వెళుతున్న మక్కల లారి, కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డికి వెళ్లుతున్న బియ్యం లారి మెంగారం మిద్దెమెట్టు బోల్తాపడ్డాయి. ఈ రెండు ప్రమాదాల్లో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

నిజాంసాగర్ ప్రాజెక్టులో శవం లభ్యం



నిజాంసాగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులో మంగళవారం శవాన్ని నిజాంసాగర్ పోలీసులు వెలికి తీశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టులోని 12 గేట్ల వద్ద 50 సంవత్సరాల వ్యక్తి శవాన్ని ఇరిగేషన్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శివకుమార్ నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించి శవాన్ని వెలికి తీశారు. 50 సంవత్సరాల వ్యక్తి తెలుపు రంగు కలిగి నల్లని వెంట్రుకలు ఉండి తెలుగు రంగు గడ్డం కలిగి ఉన్నాడని ఆయన తెలిపారు. బ్లూ కలర్ టీ షర్ట్ ధరించి కుడి చేతిపై టాటూ కలదని ఎస్సై తెలిపారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు నిజాంసాగర్ ఎస్‌హెచ్‌వో 8712686172, సీఐ 8712686170 నెంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.



దోమకొండ ప్రభుత్వ కళాశాలలో మాట్లాడుతున్న నోడల్ అధికారి

మంచి ఉత్తీర్ణత వచ్చేలా కృషి చేయాలి

దోమకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం మంగళవారం తనిఖీ చేశారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసి మంచి ఫలితాలు వచ్చే విధంగా చూడాలన్నారు. కళాశాలలో రికార్డులను తనిఖీ చేశారు. అటెండెన్స్, టీచింగ్, డైరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

15న మేరు సంఘం ఎన్నికలు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మేరు సంఘం ఎన్నికలు ఈనెల 15న నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు నారాయణ తెలిపారు. ఎన్నికల బరిలో రెండు ప్యానళ్లు పోటీకి నామినేషన్‌లు వేశారని వారికి గుర్తులు కేటాయించామని తెలిపారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

బాన్సువాడ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 12న చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టినట్లు సీఐటీయూ నాయకులు ఖలీల్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో అంగన్‌వాడీలతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు మహాదేవి, అరుణ, స్వరూప తదితరులున్నారు.

ఎమ్మెల్యేను ఆహ్వానించిన ఎల్లారెడ్డి అయ్యప్ప సేవా సమితి

ఎల్లారెడ్డి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఈనెల 18న జరగబోయే సామూహిక మహా పడిపూజ మహోత్సవానికి హాజరు కావాలని అయ్యప్ప సేవా సమితి సభ్యులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు ఆహ్వాన పత్రికను అందించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సమితి ప్రతినిధులు కలిసి ఆహ్వానపత్రికను అందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గురు స్వాములు చంద్రం గురుస్వామి, రాజేందర్‌నాథ్ గురుస్వామి, కృష్ణారెడ్డి గురుస్వామి, శ్రీనివాస్‌గౌడ్ గురు స్వామి, నవీన్ స్వాములు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు



భిక్కనూరులో ఆశాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

భిక్కనూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలివెళ్తున్న భిక్కనూరు మండల ఆశా వర్కర్లను భిక్కనూరు పోలీసులు మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆశాలు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమను అరెస్ట్ చేయడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వం వెంటనే తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశాలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మహిళలపై లాఠీచార్జి చేయడం దుర్మార్గం

● సీఐటీయూ నాయకులు ఖలీల్

బాన్సువాడ టౌన్: డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయం ముందు శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లపై పోలీసులు లాఠీచార్జి చేయడం దుర్మార్గపు చర్య అని సీఐటీయూ నాయకులు ఖలీల్ మండిపడ్డారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా మహిళలని కూడా చూడకుండా కొట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ధర్నాలో భాగంగా బాన్సువాడ నుంచి బయలుదేరుతున్న ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం అమానుషమన్నారు. అరెస్టు అయిన వారిలో ఆశావర్కర్లు రమా, సుచిత్ర, కవిత తదితరులున్నారు.



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	140	160	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

